1St Year Happy Work Anniversary.
షణ్ముఖ SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
Good for Health
Best for Readers
THE POWER OF PEN RK
సంపుటి : 3 సంచిక : 132
మంగళవారం 19 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

- ఢిల్లీలో 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సు
- హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్
- పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- విశాఖను ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక
- డేటా సెంటర్ల చుట్టూ పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్ నిర్మాణం
- అమెరికా-భారత్ అణుశక్తి సహకారంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందన్న లోకేష్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)




భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం (యూఎస్ఐఎస్ పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన "యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా" సదస్సులో లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### ఆంధ్రప్రదేశ్‌లో సహజసిద్ధ ప్రయోజనాలు

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ ▶మిగతా 2లో

## టీటీడీ ఘనత పట్ల సీఎం చంద్రబాబు స్పందన

- తిరుమలలో 89.40 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన టీటీడీ
- టీటీడీ అధికారులను, సిబ్బందిని అభినందించిన సీఎం చంద్రబాబు
- శేషాచలం కొండల్లో అటవీ సంపద పరిరక్షణపై ప్రశంసలు
- ప్రకృతిని కాపాడటం దైవ సేవతో సమానమని వ్యాఖ్య
- భావి తరాలకు పచ్చని తిరుమలను అందించాలని సూచన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)



తిరుమల కొండల్లో పచ్చదనాన్ని గణనీయంగా పెంచినందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. తిరుమల గిరుల వ్యాప్తంగా 89.40 శాతం అటవీ విస్తీర్ణాన్ని సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ టీటీడీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ.. శేషాచలం కొండల్లో అటవీ సంపదను కాపాడటం, స్థానిక జాతుల మొక్కలను పునరుద్ధరించడం కోసం టీటీడీ చేపట్టిన సుస్థిర పరిరక్షణ చర్యలు అభినందనీయమన్నారు. ఈ కృషి ఫలితంగానే పచ్చదనం గణనీయంగా పెరిగిందని కొనియాడారు. "మన సంప్రదాయాలు ప్రకృతిని పవిత్రంగా భావిస్తాయి. ▶మిగతా 2లో

## కేరళంలో కొలువుతీరిన కొత్త ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు




- కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణ స్వీకారం
- కేబినెట్ లో కొలువుతీరిన పలువురు మంత్రులు
- నూతన నాయకత్వంలో రాష్ట్రం సరికొత్త అభివృద్ధిని సాధించాలన్న పవన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళ నూతన ప్రభుత్వానికి సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కేరళ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు, అలాగే ఆయనతో పాటు మంత్రివర్గంలో కొలువుదీరిన మంత్రులందరికీ అభినందనలు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, కేరళంలో కొలువుదీరిన నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో పారదర్శకమైన, ప్రగతిశీలమైన సుపరిపాలనను అందిస్తూ కేరళంను ▶మిగతా 2లో

## నేడు కావలికి సీఎం చంద్రబాబు... మత్స్యకారుల ఖాతాల్లో రూ.20 వేలు జమ



వేట విరామ సమయంలో మత్స్యకారులకు రెండో ఏడాది ఆర్థిక సాయం
నెల్లూరు జిల్లా కావలిలో నిధులు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్ల లబ్ధి,
ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు
ఎన్నికల హామీ మేరకు సాయాన్ని
రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన ప్రభుత్వం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)

సముద్రంలో వేట నిషేధ కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఏపీలోని కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది ఆర్థిక భరోసా కల్పించనుంది. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార ▶మిగతా 2లో

## సముద్రగర్భ కేబుల్స్‌కు ఇరాన్ కత్తెర.. అమెరికా టెక్ దిగ్గజాల నుంచి వసూళ్లు..?



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 18)

హర్మూజ్ జలసంధిని మూసేసి ఇటీవల 'చమురు' షాకులిచ్చిన ఇరాన్.. ఇప్పుడు ప్రపంచంపై మరో పిడుగు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు కన్పిస్తోంది. ఈ జలసంధి కింద ఉన్న సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుళ్లపై ఫీజులు వసూలుచేయాలని టెహ్రాన్ ప్రణాళికలు వేస్తోంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియా సంచలన కథనం ప్రచురించింది. సముద్ర గర్భ కేబుళ్ల కోసం హర్మూజ్‌ను వినియోగించుకుంటున్నందుకు గానూ గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి టెక్ కంపెనీలపై రుసుములు విధించాలని ఇరాన్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సంస్థలన్నీ ఇరాన్ చట్టాలకు అనుగుణంగా నడుచుకునేలా, సబ్‌మెరైన్ కేబుల్ ఆపరేటర్లు లైసెన్సు ఫీజులు చెల్లించేలా కొత్త ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ కొత్త విధానాలు అమల్లోకి వస్తే టెక్ సంస్థలు తమ సముద్ర గర్భ కేబుళ్ల నిర్వహణ, మరమ్మతు హక్కులను కూడా ప్రత్యేకంగా ఇరాన్ కంపెనీలకు అప్పగించాల్సి ఉంటుందట.

ఈ ఫీజులను ఎలా, ఎంత వసూలు చేస్తారన్న దానిపై స్పష్టత లేనప్పటికీ.. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ అనుబంధ మీడియాలో ఈ కథనం రావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఫీజులు చెల్లించేందుకు నిరాకరించే కంపెనీలు డేటా ట్రాఫిక్ అంతరాయాలను చవిచూడాల్సి వస్తుందని కూడా ఆ కథనం హెచ్చరించడం గమనార్హం. కాగా.. 'ఇంటర్నెట్ కేబుళ్లపై ఫీజులు వసూలు చేస్తాం' అని గతవారం ఇరాన్ మిలిటరీ ▶మిగతా 2లో

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు.. స్పందించిన కేంద్రం

- అమెరికా ఆంక్షలు ఉన్నా లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఉంటాయని వెల్లడి
- దేశీయ ప్రయోజనాలకు అనుగుణంగా ముడి చమురు ధరలు ఉంటాయని వెల్లడి
- ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా రష్యా నుంచి కొనుగోలు చేశామన్న కేంద్రం




(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)

అమెరికా ఆంక్షలు ఉన్నా లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని భారత్ స్పష్టం చేసింది. దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగా ముడి చమురు దిగుమతులు ఉంటాయని తెలిపింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తులపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగిసిన నేపథ్యంలో కేంద్రం దీనిపై స్పందించింది. ▶మిగతా 2లో

## కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?


(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)



కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'సర్'పై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అప్రజాస్వామికమని సీఎం ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసింది. రాష్ట్రంలో కనీసం ధాన్యం కొనలేని పరిస్థితి నెలకొంది. రైతులు అనేక ▶మిగతా 2లో

## ప్రధాని మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం... సీఎం చంద్రబాబు అభినందనలు

- ప్రధాని నరేంద్ర మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం
- మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు
- ప్రపంచ నాయకులకు ఇచ్చే 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్' గౌరవం



ఇది ప్రధాని మోదీ అందుకున్న 31వ అంతర్జాతీయ పురస్కారం

ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. ప్రపంచ నాయకులకు ▶మిగతా 2లో

## మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)



మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని కుటుంబ సభ్యులతో ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత ఎంతో పెరిగింది. ఫోరెన్సిక్ వ్యవస్థను బలోపేతం చేయడంతో సంఘటన జరిగిన కొద్ది గంటల్లోనే అక్కడికి చేరుకుని తగిన ఆధారాలను సేకరిస్తున్నారు. ఫలితంగా నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయి. పోక్సో కేసుల్లో నిందితులకు మూడు నెలల్లోనే శిక్ష పడుతోంది. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వైకాపా నాయకులు ఆరోపిస్తున్నట్లు ఎవరిపై కక్షపూరిత చర్యలకు పాల్పడటం లేదు. కూటమి ప్రభుత్వ హయాంలో కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. భక్తుల భద్రత దృష్ట్యా సుమారు 190 సీసీ కెమెరాలను ఆలయం వద్ద ఏర్పాటు చేశాం. వీటిని ఏఐకి అనుసంధానిస్తాం' అని మంత్రి అనిత పేర్కొన్నారు.

## రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలు: మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)

రాష్ట్రంలో రూ.14 వేల కోట్లతో అమృత్ పథకం కింద పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. ▶మిగతా 2లో

## ప్రధాని మోదీకి స్వీడన్ అత్యున్నత పురస్కారం... సీఎం చంద్రబాబు అభినందనలు

స్వీడన్ అందించే అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్' ఆయనకు లభించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీ అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ పురస్కారం ఒక నిదర్శనమని చంద్రబాబు కొనియాడారు. అంతర్జాతీయంగా భారత భాగస్వామ్యాలను, ప్రపంచ దేశాలతో సహకారాన్ని బలోపేతం చేయడానికి మోదీ నిరంతరం చేస్తున్న కృషిని ఈ అవార్డు ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు.విశేషమేమిటంటే, ఇది ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రస్థానంలో అందుకున్న 31వ అంతర్జాతీయ పురస్కారం అని చంద్రబాబు వెల్లడించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ఖ్యాతిని పెంచడంలో ఆయన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు.

## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం" అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపు ప్రయోజనాలని తెలిపారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

**ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం**

ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది," అని లోకేష్ స్పష్టం చేశారు.

**ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి**

రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు.

భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. "మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం," అని ఆయన ప్రకటించారు.

**భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం**

భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐ-నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ-నేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు.

**డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్**

తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

**న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం**

న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

**ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం**

న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో

## మొదటి పేజీ తరువాయి

పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు.

**ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్**

ఏఐ విప్లవం వల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. "ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది," అని ఆయన తెలిపారు.

**యూఎస్-ఇండియా న్యూక్లియర్ అధ్యాయం**

భారత్-అమెరికా సహకారం ఇప్పటికే టెక్నాలజీ, రక్షణ, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో మార్పులు తెచ్చిందని, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో తదుపరి ప్రధాన అధ్యాయం అణుశక్తి రంగమే కాగలదని లోకేష్ బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఇంధన భాగస్వామ్యంగా కాకుండా, పారిశ్రామిక, తయారీ, ఆవిష్కరణల భాగస్వామ్యంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం పటిష్ఠమైన ఇంధన, పారిశ్రామిక పునాదులు నిర్మిస్తున్నామని, దీర్ఘకాలిక దార్శనికత కలిగిన గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

## టీటీడీ ఘనత పట్ల సీఎం చంద్రబాబు స్పందన

అడవులు, వన్యప్రాణులను రక్షించడం దైవ సేవతో సమానం. భావి తరాలకు మరింత పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమలను అందించడానికి ఈ ప్రయత్నాలు ఎంతగానో దోహదపడతాయి" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. టీటీడీ కృషి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణకు టీటీడీ యాజమాన్యం చూపుతున్న చొరవను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

## రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలు: మంత్రి నారాయణ

నెల్లూరులోని 54వ డివిజన్‌లో 350 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు పనులకు నారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలను అందిస్తామన్నారు."గత పాలకులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళం చేసి వెళ్లారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో రాజీపడట్లేదు. సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన అందిస్తున్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం. పీ4 ద్వారా పేదలకు చేయూతనిచ్చేందుకు నా వంతు కృషి చేస్తున్నా. పేదరిక నిర్మూలన.. విద్యాభివృద్ధితోనే సాధ్యం" అని నారాయణ తెలిపారు.

## కేరళంలో కొలువుతీరిన కొత్త ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

మరింత అభ్యుదయ పథంలోకి తీసుకెళ్లాలని కోరారు. 'దేవుని సొంత దేశం'గా ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి గడించిన కేరళం రాష్ట్రం, ఈ నూతన నాయకత్వంలో సరికొత్త అభివృద్ధిని, అపార సుసంపన్నతను సాధించాలంటూ పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సముద్రగర్భ కేబుల్స్‌కు ఇరాన్ కత్తెర.. అమెరికా టెక్ దిగ్గజాల నుంచి వసూళ్లు..?

అధికార ప్రతినిధి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే, ప్రస్తుతం టెహ్రాన్‌కు అమెరికా కంపెనీలు ఎలాంటి చెల్లింపులు చేయకుండా ఆర్థిక ఆంక్షలు అమల్లో ఉన్నాయి. మరి.. ఈ కొత్త విధానాలు అమలుచేస్తే టెక్ కంపెనీలు ఎలా స్పందిస్తాయన్న దానిపై స్పష్టత లేదు.

**'డిజిటల్'కు దెబ్బే..**

అంతర్జాతీయ డిజిటల్ కనెక్టివిటీకి సముద్రగర్భ కేబుళ్లే ప్రధాన ఆధారం. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఇంటర్నెట్, డేటా ట్రాఫిక్ వీటి నుంచే జరుగుతోంది. ఈ కేబుళ్లకు నష్టం జరిగినా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడినా.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇంటర్నెట్ వేగం నెమ్మదించి బ్యాంకింగ్ వ్యవస్థలు, మిలిటరీ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ విభాగాలు, సీమాంతర లావాదేవీలు ఇలా అన్నింటిపైనా ప్రభావం పడుతుంది. ప్రస్తుతం అనేక దేశాల మధ్య ఉన్న ప్రధాన సముద్రగర్భ కేబుళ్లు హర్మూజ్ కింద నుంచే ఏర్పాటు చేశారు. సింగపూర్ లాంటి ఆసియా డేటా హబ్‌లను, ఐరోపాలోని కేబుల్ స్టేషన్లను కలిపే డిజిటల్ లింక్, భారత్‌కు వచ్చే అత్యధిక ఇంటర్నెట్ ట్రాఫిక్ ఈ జలసంధి మీదుగానే ఉంది. దీంతో ఇరాన్ హెచ్చరికలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

**ఇరాన్‌కు ఆ హక్కు ఉందా..?**

1982 నాటి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ సీ' ప్రకారం.. తీరప్రాంత దేశాలకు తమ భూభాగంలో లేదా ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించే కేబుళ్లు/పైప్‌లైన్‌లకు సంబంధించి షరతులను విధించే హక్కు ఉంటుంది. ఈ కన్వెన్షన్‌పై ఇరాన్ సంతకం చేసింది కానీ.. ఇంకా దాన్ని ఆమోదించలేదు. అయితే, ప్రస్తుతం సూయజ్ కాలువ మీదుగా వెళ్లే సబ్‌సీ కేబుళ్లకు ఈజిప్టు లైసెన్సు ఫీజులు వసూలుచేస్తోంది. దీన్ని ఉదాహరణగా చూపిస్తూ ఇరాన్.. హర్మూజ్‌లోని కేబుళ్లపై వసూళ్లకు సిద్ధమైంది. అయితే, ఈ రెండూ విభిన్నమైన జలమార్గాలు. సూయజ్ కాలువను ఈజిప్టు భూభాగం మీదుగా కృత్రిమంగా ఏర్పాటుచేయగా, హర్మూజ్ సహజసిద్ధంగా ఏర్పడిన జలసంధి. పైగా ఇది ఇరాన్ ప్రాదేశిక జలాల కిందకు రాదని అంతర్జాతీయ చట్టాలు చెబుతున్నాయి. మరి ఈ వసూళ్ల వార్తలపై టెక్ కంపెనీలు ఎలా స్పందిస్తాయో చూడాలి..!

## రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు.. స్పందించిన కేంద్రం

ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు.రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా భారత్ అక్కడి నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. ఆంక్షలను సడలించినప్పుడూ మాస్కో నుంచి చమురు దిగుమతి చేసుకున్నామని అన్నారు. ఇప్పుడు కూడా ఆ కొనుగోళ్ళు కొనసాగుతాయని తెలిపారు. చమురు ఏ దేశం నుంచి కొనాలనేది పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు.అందువల్ల అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా లేకపోయినా మనకు ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. దేశంలో చమురు కొరత లేదని తెలిపారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, రష్యా చమురు కొనుగోలు చేసేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలకు అనుమతిస్తూ అమెరికా ఆంక్షలు సడలించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే సముద్రంలో ఉన్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్ళు జరపాలని గతంలో తెలిపింది. ఆ గడువు మే 17తో ముగిసిన నేపథ్యంలో దేశంలో చమురు కొరతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో, కేంద్రం స్పందించింది.

## కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?

ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. యూపీఏ హయాంలో ధాన్యం క్వింటాకు రూ.1,300 గిట్టుబాటు ధర ఉండేది. మోదీ ప్రభుత్వం దాన్ని రూ.2,360కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది. రాష్ట్రంపై రూపాయి కూడా భారం పడదు. మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కారు ధాన్యం మీద బోనస్ అని చెప్పి మాట తప్పింది. రాష్ట్ర మంత్రులంతా ఒక్కో జిల్లాకు వెళ్లి కొనుగోళ్లపై దృష్టి పెట్టి రైతుల ఇబ్బందులు తీర్చాలి.

**అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు**

ఇక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయానికొస్తే ఒక్కొక్కరికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉంటే గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా రోహింగ్యాల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు. 'సర్'పై రేవంత్‌రెడ్డి అనేక విమర్శలు చేస్తున్నారు. ఓట్ల ప్రక్షాళన మోదీ వచ్చి చేయరుగా.. రాష్ట్ర అధికారులే చేస్తారు. అయినా రేవంత్‌రెడ్డికి వారిపై విశ్వాసం లేదేమో. ఇటీవల ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్లు తొలగిస్తోందని సీఎం రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. 'సర్' విషయంలో కేంద్రం కుట్రలు చేయాలని చూస్తోందని ఒక భారాస నేత ఆరోపించారు. అదేంటో బయట పెట్టాలని నేను సవాల్ చేస్తున్నా. పెట్రోల్, డీజిల్‌పై అప్రజాస్వామికంగా ధరలు పెంచారని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అంశం కాదు. గతంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువ ఉన్నప్పుడు ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం తగ్గించింది. రాష్ట్రాలను కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. మోదీ విజ్ఞప్తితో అనేక రాష్ట్రాలు తగ్గించాయి కూడా. దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తోంది తెలంగాణలోనే" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి భగీరథ్ కేసుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ కేసులో కేంద్రం ప్రమేయం ఉండదని అన్నారు. రాష్ట్ర పోలీసులకు సంబంధించిన విషయమని, వారే దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## నేడు కావలికి సీఎం చంద్రబాబు... మత్స్యకారుల ఖాతాల్లో రూ.20 వేలు జమ

కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తూ, ఒక్కో కుటుంబానికి రూ.20,000 చొప్పున మొత్తం రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనుంది. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంట గ్రామంలో రేపు (మంగళవారం) జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నిధులను లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి చాటనున్నారు.ప్రతీ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల ప్రజనన కాలాన్ని పరిగణనలోకి తీసుకుని వేటపై నిషేధం విధిస్తారు. ఈ సమయంలో ఉపాధి కోల్పోయి మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.10,000గా ఉన్న ఈ సహాయాన్ని, ఎన్డీఏ కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.20,000కు పెంచింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, బలహీన వర్గాల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది.గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు అందించిన ప్రభుత్వం, ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్యను పెంచి 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్లు విడుదల చేస్తోంది. దీంతో ఈ రెండేళ్లలోనే వేట నిషేధ భృతి కింద ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.505 కోట్లకు చేరుకుంది. లబ్ధిదారుల సంఖ్యను పెంచడం, సాయాన్ని రెట్టింపు చేసి సకాలంలో అందించడం మత్స్యకారుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోంది.

ఇదే కాకుండా, వేట చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడంలోనూ ప్రభుత్వం వేగంగా స్పందిస్తోంది. 2024-25లో 63 క్లెయిమ్స్‌కు గాను రూ.3.15 కోట్లు, 2025-26లో పెండింగ్‌లో ఉన్న 113 క్లెయిమ్స్‌కు రూ.5.65 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించింది. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచే ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టి సారించిన ప్రభుత్వం, సముద్రపు నాచు (సీవీడ్) సాగును ప్రోత్సహిస్తూ వారికి అదనపు భరోసా కల్పిస్తోంది.

## పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాది

### నూతనంగా ఎంపికైన 8 మంది ఆయాలకు నియామకపత్రాలు అందించిన ఎమ్మెల్యేలు దామచర్ల, ఏలూరి



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మే 18)**

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన ఎనిమిది మంది అంగన్వాడీ ఆయాలకు నియామక పత్రాలు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో చిన్నారులకు మంచి విద్య, సంస్కారం, పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాల సేవలు ఎంతో ముఖ్యమన్నారు. పిల్లల మానసిక పరిపక్వతకు బీజం పడేది అంగన్వాడీ కేంద్రాల్లోనేనని తెలిపారు. చిన్నారుల్లో అభ్యాస నైపుణ్యాలు, సామాజిక అవగాహన పెంపొందించేందుకు అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా వ్యవహరి ంచాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ గ్రామీణ స్థాయిలో సేవల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు సుభద్ర, సులోచన, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో ఖోఖో పోటీలు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 18)**

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులతో ముందుగా వివిధ రకాల విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో వారికి ఖోఖో పోటీలు నిర్వహించడం జరిగింది. చివరిగా పిల్లలకు స్నాక్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 36 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.






ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
19.05.26 మంగళవారం


## జన గణన విధి
# నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్
### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 18)



జన గణన విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులు ఆదేశించారు. జిల్లాలో పురోగతి పై సోమవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెన్సస్ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి గరిష్టంగా ఐదు నిమిషాలు మాత్రమే పట్టే ఈ సర్వేలో ఎందుకు స్పష్టమైన పురోగతి ఉండటం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు, తహసీల్దారులు, డిప్యూటీ తహసిల్దార్లు తమ పరిధిలో నిర్దిష్ట ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఈ సర్వే త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సెన్సస్ విధులకు కేటాయించిన సిబ్బందిని సంబంధిత అధికారుల దృష్టి తీసుకువెళ్లకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపసంహరించటం, మార్పు చేయటం వంటి నిర్ణయాలు తీసుకోవద్దని క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఓ సుధాకర్‌రెడ్డి, డిపిఓ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఈవో రేణుక, సెన్సస్ విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల పై
# ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి
### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 18)

మార్కాపురం జిల్లాలో జాతీయ రహదారుల మీద ప్రమాదాలు జరగకుండా ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆమె ఛాంబర్ నందు జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల మీద ప్రమాదాలు జరగకుండా ఆక్రమణలు తొలగించడానికి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయ దం జరిగిందని చెప్పారు. జిల్లాలో ఉన్న మూడు జాతీయ రహదారుల పై ఆక్రమణలు తొలగించడానికి సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల పై వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా వాహనదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. మున్సిపల్ ప్రాంతాలలో జాతీయ రహదారి మీద అక్రమంగా ఉన్న దుకాణాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల మీద రాత్రి సమయాల్లో పశువులను తోలకుండా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జాతీయ రహదారుల మీద ప్రమాదం జరిగే బ్లాక్ స్పాట్స్ ను సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి గుర్తించాలని అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల పై ప్రమాదాలు జరిగిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, జిల్లా రెవెన్యూ అధికారి శివరామరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.








# ఈకైవైసీ తప్పనిసరి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 18)

రేషన్ సరకుల పంపిణీలో మరింత పారదర్శ కత తెచ్చేందుకు కార్డుదారులకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేశారు. ఇప్పటికీ చేయించుకోని కార్డుదారులకు తాజాగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మరో అవకాశం ఇచ్చింది. ఇందుకోసం జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను నవీకరించింది. ప్రస్తుతం ఈకేవైసీ లేకున్నా సరకులు ఇస్తున్నారు. కార్డులోని కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మృతి చెందినా వారికి కూడా ప్రతి నెలా అయిదు కిలోలు చొప్పున బియ్యం ఇస్తున్నారు. ఇక పై అలా కుదరదు. ఈ నెలాఖరు లోగా కార్డులోని సభ్యులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయిలో నమోదు చేపడుతున్నారు. అయిదేళ్ల లోపు పిల్లలకు మినహాయింపు ఇచ్చారు. మార్కాపురం జిల్లాలోని 21 మండలాల్లోని మొత్తం రేషన్ కార్డుల్లో 10,15,212 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 9,48,639 మంది వివరాల నమోదు పూర్తయ్యింది. మరో 36,211 మంది వివరాలు పెండింగ్లో ఉన్నాయి. అయిదు నుంచి ఎనభై ఏళ్లలోపు వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఇన్చార్జి పౌరసరఫరాల శాఖ అధికారి అంకయ్య తెలిపారు.

**ఇక పై అర్హులకే లబ్ధి...** గతేడాది మార్చి నుంచి జూన్ వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈకేవైసీ చేయించారు. బియ్యం కార్డుదారుల్లోని కుటుంబ సభ్యులు ఎవరు వేలిముద్ర వేసినా సరకులు ఇస్తారు. ప్రత్యేకించి మృతుల పేర్లు తొలగించే విధానం లేకపోవడంతో వారికి బియ్యం పంపిణీ జరుగుతోంది. తాజాగా ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో వీరి వివరాలు తొలగనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ పరిధిలోకి వచ్చే వారుంటే వారిని గుర్తించనున్నారు. ప్రస్తుత ప్రక్రియతో కార్డుల్లోని మృతులు, అనర్హుల వివరాలు తొలగి, నిజమైన లబ్ధిదారులకే సరకులు అందుతాయని అధికారులు భావిస్తున్నారు.

# గత వైసిపి పాలకులు చేసిన అరాచకాలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు
### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 18)

గత వైసీపీ పాలకులు చేసిన అరాచకాలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గనివినిపాడు, వాగుమడుగు గ్రామాల్లోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనకనమిట్ల మండలానికి రిలయన్స్ ప్రాజెక్టును మూడువేల కోట్ల రూపాయలతో తీసుకువచ్చామన్నారు. దీంతో వేలాది మందికి ఉద్యోగాలు, రైతులకు మంచి జరుగుతుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో పూర్తి కాని వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసామని చెప్పి ప్రారంభించి వెళ్లిపోయారన్నారు. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పూర్తి కి ఇంకా రెండు వేల కోట్ల రూపాయలు అవసరమన్నారు. వచ్చే ఐదు, ఆరు నెలల కాలంలో ఆ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.





# సిఎం చంద్రబాబును కలిసి మాజీ మంత్రి బాలినేని
### జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసిన కలయిక



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 18)

రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్ నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను మాజీ మంత్రి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, రాజకీయ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాల్సిన అవసరంపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. అలాగే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు (తరువాయి 4లో...)

## ఐటీవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పరిశీలన

**ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు విద్యుత్ సబ్ స్టేషన్ ఒక వరం**

**వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు**







**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 18)**

మండలంలోని ఐటీ వరం పంచాయతీలో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చేతుల మీదుగా ప్రారంభంకానున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను సోమవారం యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులుతో మాట్లాడుతూ, గ్రామాల్లో తరచూ ఎదురవుతున్న లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు నివారించేందుకు ఈ సబ్‌స్టేషన్ కీలకమని ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. ఇంకా మిగిలి ఉన్న పనుల వేగం పెంచి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. స్థానిక రైతులకు పీక్ టైమ్‌లో నిరంతర విద్యుత్ అందేవిధంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాక, సబ్‌స్టేషన్ ప్రారంభం తర్వాత ఐటీ వరం, పుల్లలచెరువు పరిసర గ్రామాల అభివృద్ధికి ఇది ఒక ప్రధాన మౌతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తగిన సదుపాయాలు అందించేందుకు పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులు పొట్లా గోవింద్, సీనియర్ నాయకులు బోగోలు సుబ్బారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు, ఐటీవరం గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే దామచర్ల




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)**

ఒంగోలు నగర పాలక సంస్థ యాజమాన్యంలోని అన్ని పాఠశాలలో 10 వతరగతి ఫలితాలలో ప్రథమంగా నిలచిన పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను



సోమవారం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆయన నివాసంలో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు వారి వారి భవష్య కార్యాచరణలను అడిగి తెలుసుకొని వారికి అవసరమైన సూచనలు, మంచి ఫలి తాలను సాధించినందుకు ప్రధానోపాధ్యాయురాలు మువ్వా రాధిక, సమిష్టిగా కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వబడులు కూడా ప్రైవేటు పాఠశాలల కన్నా విద్యార్థులు ఎక్కువగా చేరేందుకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకొని నగరంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# సిఎం చంద్రబాబును కలిసి మాజీ మంత్రి బాలినేని జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసిన కలయిక



పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం, కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. రానున్న రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, కూటమి బలోపేతం మరియు ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అంశాలపై కీలక చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే కూటమిలో భాగస్వామి అయిన జనసేన పార్టీలో సుమారు రెండేళ్ళ క్రితం చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును నేడు కలవడం జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ భేటీ రాష్ట్ర రాజకీయాల్లో సైతం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అధిక రక్తపోటులు నియంత్రించాలి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 18)**

స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే ఎస్సై పి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యకరమైన, శారీరిక శ్రమ లేకపోవడం వల్ల, అతిగా మద్యం సేవించడం వలన, ధూమపానం వలన, ఒత్తిడి వలన కూడా రక్తపోటుని పెంచుతుందని అన్నారు. అధిక రక్తపోటును నియంత్రించడం అనేది ఒక్కసారి చేసే పని కాదు. రక్తపోటు మెరుగుపడిన తర్వాత కూడా అది ఆరోగ్యకరమైన పరిధిలో ఉండేలా చూసుకోవడానికి క్రమం తప్పని ఫాలో అప్‌లు ముఖ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భాస్కరరావు సూపర్వైజర్లు శ్రీనివాసరావు సుజాత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గత వైసిపి పాలకులు చేసిన అరాచకాలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు

ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధించామని, ఇంతకు ముందు ఒంగోలు వెళ్లాలంటే సమయంతో పాటు ధన వ్యయం కూడా ఎక్కువగా ఉండేదన్నారు. మార్కాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమి రెట్లు పెరిగి రైతులు బాగుపడ్డారని అన్నారు. త్వరలోనే ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), రాజు, వెలిగొండ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీలో 16,000 ఇ-సైకిళ్లు.. ఉద్యమంగా మార్చాలన్న సీఎం చంద్రబాబు

**ఏపీలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని ఉద్యమంగా మార్చే యోచన**


**స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు 16,000 ఇ-సైకిళ్లు**

**ఈవీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష**

**సులువైన రుణాల కోసం ప్రత్యేక ఎస్పీవీ ఏర్పాటుకు నిర్ణయం**

**ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామన్న ప్రభుత్వం**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)**



రాష్ట్రంలో ఇంధన పొదుపును ప్రోత్సహించడంతో పాటు, పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సాహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ఒక ఉద్యమంగా మార్చాలని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తొలి దశలో 16,000 ఎలక్ట్రిక్ సైకిళ్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందికి అందించాలని నిర్ణయించారు. సోమవారం నాడు సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ సైకిళ్లు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యాలయ సిబ్బందికి అందించే 16,000 ఇ-సైకిళ్లను సులభ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

సామాన్యులు కూడా ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేందుకు వీలుగా రుణాలు అందించేందుకు ఒక ప్రత్యేక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలన్నారు. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కంపెనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

## సెన్సస్ వర్క్ 20వ తేదీ లోపు పూర్తి చెయ్యాలి

**ఆర్డీవో గ్లోరియ**



**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మే 18)**

బాపట్ల ఆర్డీవో గ్లోరియ సోమవారం మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామంలో జరుగుతున్న నివాస, నివసేతర ఇండ్ల గణనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క గృహము కూడా వదిలివేయరాదని పారదర్శకంగా సర్వే చెయ్యలని సిబ్బందిని అదేశించారు. ఈ కార్యక్రమంలో బొల్లాపల్లి విఆర్వో ఆంజనేయులు, ఎన్యూమరేటర్ సరోజిని, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్'.. అలర్ట్ గా ఉండాలంటూ పార్టీ శ్రేణులకు సజ్జల ఆదేశం

**జూన్ 15 నుంచి ఏపీలో ఎస్ఐఆర్ జరుగుతుందన్న సజ్జల**

**అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచన**

**సమర్థవంతంగా పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 18)**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం నేపథ్యంలో వైసీపీ తన క్యాడర్‌ను ఈ కార్యక్రమం కోసం సిద్ధం చేస్తోంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ పరిశీలకులతో నిర్వహించిన కీలక సమావేశంలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ 15న ప్రారంభమై సెప్టెంబర్ వరకు అత్యంత కీలకమైన దశల వారీగా సాగనుందని ఆయన వివరించారు. సజ్జల వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం, జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. అనంతరం జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియను పూర్తి చేసి, చివరగా సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినది కావడంతో, పార్టీ తరఫున నియమించిన కమిటీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.




ఈ ఓటర్ల సవరణ క్రతువులో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని సజ్జల స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లతో (దీూాం) నిరంతరం సమన్వయం చేసుకుంటూ, వైసీపీ సానుభూతిపరుల ఓట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుండి తొలగించబడకుండా డ్రాఫ్ట్ స్థాయిలోనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం బీఎల్ఏలకు త్వరలోనే ప్రత్యేక ఓరియెంటేషన్, శిక్షణ ఇస్తామని ప్రకటించారు. ఇది 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కావడం వల్ల ఒకసారి ఓటు తొలగిస్తే మళ్లీ చేర్చడం చాలా కష్టమని, ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తేనే ఓటు భద్రంగా ఉంటుందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు. ఈ సుదీర్ఘ ప్రక్రియలో సమర్థవంతంగా పనిచేసి, బాధ్యతలను నెరవేర్చే బీఎల్ఏలకు రాబోయే రోజుల్లో పార్టీలో తగిన గుర్తింపు, పురస్కారాలు తప్పకుండా ఉంటాయని సజ్జల రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు.

# కూటమి ప్రభుత్వానిది మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
## వినుకొండలో రైతులకు రూ.30.33 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 18)

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకూడదనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. సోమవారం వినుకొండ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 18 మంది రైతు సోదరులకు, వారు నిలువ చేసుకున్న ధాన్యం ఆధారంగా రూ. 30 లక్షల 33 వేల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పంట చేతికి రాగానే మార్కెట్లో తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే మార్కెట్ యార్డ్ గిడ్డంగిలో ధాన్యం భద్రపరుచుకునే సదుపాయాన్ని కల్పించామని, అలా నిలువ చేసుకున్న రైతులకు తక్షణ పెట్టుబడి ఖర్చుల కోసం వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ పెద్ద మొత్తంలో రుణ సహాయం అందించి అండగా నిలిచిందని చెప్పారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో నడుస్తున్న ఈ ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వం కాదని, రైతుల సంక్షేమానికి కట్టుబడిన చేతల ప్రభుత్వమని కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాలు, కరవు లేదా అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు భారం పడకుండా, ఒక్క రూపాయి ప్రీమియం కూడా లేకుండా ప్రభుత్వమే ఉచిత పంటల భీమాను అమలు చేస్తోందని, పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ అదే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. రైతులకు పగటిపూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్నామని, విత్తనం నుండి విక్రయం వరకు అండగా ఉండేందుకు గ్రామ స్థాయిలోనే రైతు సేవా కేంద్రాలను (ఆర్బీకేలు) ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఇక్కడే అందిస్తున్నామని వివరించారు. ప్రతి రైతు సాగు చేసిన పంటను డిజిటల్ పద్ధతిలో నమోదు (ఈ–క్రాపింగ్) చేయడం ద్వారా కనీస మద్దతు ధర, బీమా, సున్నా వడ్డీ రుణాల అర్హతను పారదర్శకంగా కల్పిస్తున్నామని, చిన్న, సన్నకారు రైతులకు మేలు చేసేలా భారీ సబ్సిడీపై ట్రాక్టర్లు, ఆధునిక వ్యవసాయ పనిముట్లను గ్రూపుల ద్వారా అందించి యాంత్రీకరణకు ఊతం ఇస్తున్నామని చెప్పారు. ఒకప్పుడు కరవు పీడిత ప్రాంతంగా ముద్రపడిన పల్నాడు, వినుకొండ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని, నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని ఆయకట్టుకు చివరి భూములకు సైతం సాగునీరు అందేలా కాలువల మరమ్మతులు, ఆధునీకరణ పనులను వేగవంతం చేశామని, ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెంచేందుకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, స్థానిక వాగుల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇదే వేదిక పై ఇంధన పొదుపు, దేశ రక్షణ అంశాల పై జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ "దేశభక్తి కూటమిది..

రాజకీయ స్వార్థం జగన్ ది" అని విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సంక్షేమం తలెత్తిన సమయంలో, ఇంధనాన్ని ఆదా చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ గారు పిలుపునిస్తే, దాన్ని ఒక దేశభక్తిగా స్వీకరించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఇంధన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ప్రధాని ఆలోచనలను ఆచరణలో పెడుతూ సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శంగా నిలిస్తే, ప్రభుత్వ చీఫ్ విప్‌గా తన కాన్వాయ్‌ని భారీగా తగ్గించుకుని, ఈవీ వాహనాలు, సైకిల్ వాడకాన్ని ప్రారంభించడం మా కూటమి ప్రభుత్వ దేశభక్తికి నిదర్శనమన్నారు. ఇంధన పొదుపులో భాగంగానే రాష్ట్రంలో భారీ ఎత్తున సోలార్ విద్యుత్తును ప్రోత్సహిస్తున్నామని, సామాన్యులపై భారం పడకుండా కరెంటు చార్జీలు కూడా పెంచకుండా పాలిస్తున్న ఘనత మా కూటమి ప్రభుత్వానిదని, పేద వర్గాలకు అండగా నిలుస్తూ భారీ ఎత్తున సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేలాగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేస్తూ రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. దేశ రక్షణ, రాష్ట్ర ప్రగతి కోసం తాము ఇంధన పొదుపుపై, ప్రత్యామ్నాయ ఇంధనాలపై అడుగులు వేస్తుంటే, దాన్ని కూడా రాజకీయం చేస్తూ జగన్ రెడ్డి నంగనాచి మాటలు మాట్లాడటం కేవలం ఆయన రాజకీయ స్వార్థం మాత్రమేనని మండిపడ్డారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, 2019లో పెట్రోల్ రూ.76, డీజిల్ రూ.68 ఉంటే.. కేవలం ఏడాది కాలంలోనే, అంటే 2020 నాటికి పెట్రోల్‌ను రూ.107, డీజిల్‌ను రూ.99కి చేర్చి, లీటరుకు రూ.31 పెంచి ప్రజల నడ్డి విరిచిన జగన్‌రెడ్డికి ఇంధన ధరల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. నాడు అధికార స్వార్థంతో రోడ్డు సెస్, వ్యాట్, అదనపు వ్యాట్ అంటూ రకరకాల పన్నుల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిన ఘనత గొడ్డలి పార్టీదని, మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో రాష్ట్ర ప్రజలపై రూపాయి కూడా అదనపు పన్ను వేయకుండా బాధ్యతగా పాలిస్తుంటే, జగన్‌రెడ్డి మాత్రం తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి గత వారం కేవలం రూ.3 మాత్రమే పెరిగితే, దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదిస్తూ జగన్ డ్రామాలు ఆడటం ఆయన రాజకీయ దివాళాకోరతనానికి నిదర్శనమన్నారు. నాడు ఏడాదిలో రూ.31 పెంచి రాష్ట్రాన్ని లూటీ చేసిన జగన్‌రెడ్డి, నేడు అంతర్జాతీయంగా పశ్చిమాసియా యుద్ధం వల్ల రూ.3 పెరిగితే విమర్శలు చేయడం ముమ్మాటికీ ప్రజలను మోసం చేసే 'జగన్ నాటకమే' నని విమర్శించారు. నెలకు కొన్ని లీటర్ల పొదుపు దేశ ఆర్థిక వ్యవస్థకు కొండంత అండగా మారుతుందని, ఇంధన పొదుపు అనేది దేశభక్తికి నిలువెత్తు నిదర్శనమని పిలుపునిచ్చారు. చివరగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను (క్వింటాలుకు) రైతులకు తెలియజేశారు. లబ్ధి పొందిన 18 మంది రైతులతో పాటు నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ వడ్డీలేని రుణాలను, గిడ్డంగి వసతులను రైతులందరూ సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మురళీకృష్ణ యాదవ్, అధికారులు, స్థానిక కూటమి నాయకులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## జన్ భాగి దారి పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 18)

కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఐటిడిఏ శ్రీశైలం ఆధ్వర్యంలో జిల్లాలోని చెంచు గ్రామాలు, తండాల్లో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలకు సంబంధించి 'జన్ భాగి దారి పోస్టర్ ను స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఐటీడీఏ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఐటీడీఏ ఏపీవో, జిల్లా నోడల్ అధికారి ఏ. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన చెంచు గ్రామాలు, తండాల్లో మొక్కలు నాటే కార్యక్రమం, 20వ తేదీన ట్రాన్సిట్ వాక్, 21 నుంచి 23 వ తేది వరకు జన్ సున్ వాయ్ కార్యక్రమం, 24 వ తేదిన తీసుకున్న అర్జీల సమీకరణ చేసి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో లకు ఇవ్వడం జరుగుతుందన్నారు. 25వ తేదీన కలెక్టర్ సమక్షంలో కార్యక్రమం పై చర్చ ముగింపు ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రకటించిన తేదీల్లోనే శ్యాంక్యూయేచర్, మెడికల్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, మార్కాపురం డిటిడబ్ల్యూ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించాలి
### ఒంగోలులో వైసీపీ శ్రేణులు నిరసన ర్యాలీ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

పెంచిన పెట్రోల్, డీజల్ ధరలను తగ్గించాలని కోరుతూ ఒంగోలులో వైసీపీ శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో అంబేద్కర్ భవనం నుంచి చర్చి సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో వైసీపీ నాయకులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం పెట్రోల్, డీజల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతుందని పార్టీ నాయకులు ఆరోపించారు. ఇంధన పొదుపు చేయాలని ప్రధాని పిలుపు నిచ్చిన రాష్ట్రంలో మంత్రులు ప్రజా ప్రతినిధులు విమానాల్లో ప్రయాణిస్తూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. పెరిగిన ధరలను తగ్గించేంత వరకు వైసీపీ పోరాటం చేస్తుందని తెలిపారు.అనంతరం ఆర్డీఓను కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు సమన్వయకర్త రవిబాబు, సిటీ ప్రెసిడెంట్ కటారి శంకర్, రాష్ట్ర కార్యదర్శులు రమణరెడ్డి, వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షురాలు రషిదా, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహహస్తం ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 18)

కనిగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రోజున స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, నిరాశ్రయులకు, మతిస్థిమితం లేని వృద్ధులకు ఆహారం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రతి సోమవారం గర్భిణీ స్త్రీలు, డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, పేద ప్రజలకు మా వంతు సేవ అందిస్తాం. ఆకలితో ఉన్న పేదవారికి ఆహారం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు మీరా మొహిద్దిన్, కిషోర్ బాబు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత గడువు లోపు నాణ్యమైన పరిష్కారం చూపాలి
### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు
### పిజిఆర్ఎస్‌కు 257 అర్జీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులకు నిర్దేశిత గడువులోపల నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎస్డిసిలు కళావతి, విజయజ్యోతి, డిపిఓ వెంకటేశ్వరరావులతో కలసి ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సమస్య పై తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు మళ్లీ రీఓపెన్ కాకూడదని, ఒకవేళ ఏదైనా అర్జీ రీఓపెన్ అయితే సంబంధిత అధికారి తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో మొత్తం 257 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.









## పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, మే 18)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరిస్తున్నట్లు మండల తహాశీల్దార్ జె ప్రభాకరరావు అన్నారు. సోమవారం మండల రెవిన్యూ కార్యాలయంలో మండల అధికారుల సమక్షంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి రొండు అర్జీలను స్వీకరించినట్లు తహాశీల్దార్ జె ప్రభాకరరావు అన్నారు. సర్వే నిమిత్తం అవి ధాఖలు అయ్యినట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ప్రభాకరరావు, ఎంపిడిఓ కె ధనలక్ష్మి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఇతర మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వేముల సుబ్బరాజా

### సుబ్బరాజాను అభినందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 18)



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా వేముల సుబ్బరాజా నియమితులయ్యారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్



జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మున్సిపల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి మరియు పలువురు ముఖ్య నాయకుల సహకారంతో సుబ్బరాజాకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఎకడప జిల్లా బీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన వేముల సుబ్బరాజా సోమవారం బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, మున్సిపల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి,ఎంఆర్ఎఫ్ టైర్ డీలర్ గుర్రంపాటి రమణారెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.


**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా :**

వేముల సుబ్బరాజా మాట్లాడుతూ వైఎస్సార్సీపీలో తాను చేసిన సేవలను గుర్తించి, నమ్మి ఈ పదవిని అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా, రాజగోపాల్‌రెడ్డి, ఇతర సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా, తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, నిరంతరం పార్టీ బలోపేతం కోసం అండగా ఉంటానని సుబ్బరాజా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 18)

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లోని ప్రతి వార్డుకు వెళ్లి రోగులకు వైద్య సహాయం ఏ విధంగా అందుతుందో అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హాస్పిటల్లో కొంత వైద్య పరికరాల కొరత ఉన్న మాట వాస్తవమని వైద్యుల కొరత కూడా ఉందని ఈ మధ్యనే వైద్య విధాన పరిషత్ డైరెక్టర్‌తో మాట్లాడమన్నారు. త్వరలోనే ఈ హాస్పిటల్‌కు వైద్య సిబ్బంది సరిపడా వస్తారని మాట ఇచ్చారని అన్నారు. ఈ ఆసుపత్రిలో త్వరలోనే మరిన్ని సౌకర్యాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు. వారి వెంట హాస్పిటల్ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

## మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు డిమాండ్

### ప్రజలపై పడుతున్న అదనపు భారాన్ని తొలగించాలి










(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 18)

రాష్ట్రంలో పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలపై పడుతున్న అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత కు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా మార్కాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు కలిసి భారీ నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని, ఇంధనాల పై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న అదనపు పన్నులను పునఃసమీక్షించాలని, ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రైతులు, ఆటో కార్మికులు, రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర పెరుగుదల వల్ల సామాన్య ప్రజల పై పడుతున్న భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ప్రజల తరఫున మరింత విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు. ప్రజల పై పడుతున్న అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ చంద్రబాబు తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్‌ఛార్జీలు, రవాణా ఖర్చులు పెరిగి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో ఇంధన ధరల పెంపు ప్రజల పై మరింత భారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ వన్ గ్లోబల్ కళాశాల అధినేత షంషీర్ అలీబేగ్, మాజీ మార్కెట్ చైర్మన్ గోలమరి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, జడ్పిటిసి బాపన్ రెడ్డి, మండల కన్వీనర్ చెంచిరెడ్డి, పట్టణ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, తర్లపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 220 ఉప సంహరించుకోవాలి

## 20న ఆల్ ఇండియా మందుల షాపులు బంద్

### కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డి కృష్ణారెడ్డి







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 18)

ఆన్లైన్‌లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మందుల విక్రయాలను నిలిపివేయాలని జీవో నెంబర్ 220 ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన ఆల్ ఇండియా మందుల షాపులు బంద్ చేపట్టడం జరుగుతుందని కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డి. కృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో వారు బంద్ కు సంబంధించిన కరపత్రం నీ ఆవిష్కరించి మాట్లాడారు. ఆన్లైన్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మందుల విక్రయాలు నిలిపివేయాలని జి ఎస్ ఆర్ ఈ రూల్స్ 220 ఉపసంహరించాలని జీవో నెంబర్ 817 ను ఉపసంహరించాలని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టామని అయితే కోవిడ్ వలన ప్రజలు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆనాడు ఆందోళన ఉపసంహరించుకున్నామని అన్నారు. ఆన్లైన్లో మందులు వి క్రయాలు జరిగినందువలన యువతకు మత్తు పదార్థాలు కు బానిస అయ్యే అవకాశం ఉందని, డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా మందులు వాడటం విరుద్ధమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. భారతదేశవ్యాప్తంగా ఉన్నటువంటి 20 లక్షల మంది మందుల దుకాణాలు యజమానులు ఈ బందులో పాల్గొంటున్నారని 19వ తేదీ అర్ధరాత్రి నుండి 20వ తేదీ అర్ధరాత్రి వరకు మందులు షాపులు దేశవ్యాప్తంగా బంద్ పాటిస్తున్నారని ప్రజలు సహృదయంతో అర్థం చేసుకొని సహకరించాలని అన్నారు. 20వ తేదీ మందుల దుకాణాల బంద్ సందర్భంగా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అసౌకర్యాలు జరక్కుండా ఉండేందుకు హాస్పటల్లో ఉన్నటువంటి మందులతో దుకాణాలు తెరిచి ఉంటాయని అత్యవసర మందులు కోసం టోల్ ఫ్రీ నెంబర్ ను ఉపయోగించుకోవాలని అన్నారు. మందుల దుకాణాల బందును వ్యాపారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి శ్రీధర్, అసోసియేషన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి వెంక రెడ్డి, కేవీ సత్యనారాయణ, జిల్లా హోల్ సేల్ కార్యదర్శి హారిక రవి, పట్టణ రిటైల్ అసోసియేషన్ కన్వీనర్, కొల్లా మధు, జిల్లా కోశాధికారి సతీష్, పిసిడి అసోసియేషన్ కార్యదర్శి రమణారావు, ఒంగోలు రిటైల్ కోశాధికారి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రధాన డిమాండ్లు :** ఆన్లైన్లో మందుల అమ్మకాలకు వీలుకల్పించే జీఎస్ఆర్817(ఈ) రూల్‌ను ఉపసంహరించాలి. కార్పోరేట్ సంస్థలు అధిక డిస్కౌంట్ల ద్వారా అనైతిక వ్యాపారం నిర్వహిస్తూ చిన్న చిన్న మెడికల్ షాపుల నిర్వీర్యానికి పాల్పడే విధానాన్ని అరికట్టాలి. కోవిడ్ సమయంలో అత్యవసర మందుల పంపిణీకి వీలుకల్పిస్తూ తీసుకువచ్చిన రూల్ జిఎస్ఆర్ 220(ఈ) ని ఉపసంహరించాలి.

**ఆందోళనకు ప్రధాన కారణాలు :** రోగి వివరాలను ఉపయోగించి కల్పిత డాక్టర్లు ఏఐ ద్వారా నకిలీ ప్రిస్క్రిప్షన్లను తయారు చేసి ఆన్లైన్ ద్వారా మందుల అమ్మకాలు జరపడం. దొంగ డాక్టర్లు, ధృవీకరించలేని ఆన్లైన్ కన్సంట్లు , నకిలీ ప్రిస్క్రిప్షన్లు నిజమైన డాక్టర్ల ప్రతిష్ట ను దెబ్బతీయడం జరుగుతుంది.చాలా సందర్భాలలో ప్రిస్క్రిప్షన్ ఎవరు జారీ చేశారో తెలియని పరిస్థితి. యాంటీ బయాటిక్స్, మత్తు కలిగించే మందులు మరియు షెడ్యూల్ హెచ్, హెచ్1, ఎక్స్ లాంటి నియంత్రిత, సున్నితమైన మందులను ఎలాంటి పరిశీలన లేకుండా అమ్మకాలు జరగడం. ఆన్లైన్లో అమ్మిన మందులకు ఫార్మాశిస్ట్ పర్యవేక్షణ లేకపోవడం, ప్రమాణాలతోకూడిన ప్రిస్క్రిప్షన్ దృవీకరణ లేకపోవడం. ఒకే ప్రిస్క్రిప్షన్పై పదేపదే మందులు కొనుగోలు చేసి అనేక సార్లు ఉపయోగించే ప్రమాదం ఉండటం. యువతలో వ్యసనప్రమాదానికి కారణమైన మత్తుకలిగించే మందులు ఆన్లైన్లో అందుబాటులో ఉండటం. యాంటీ బయోటిక్స్ అమ్మకాలపై ఆన్లైన్లో నియంత్రణ లేకపోవడం, అనియంత్రిత అమ్మకాల వలన యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్కు దారితీస్తుంది. సాధారణ ఉత్పత్తుల వలే మందులను వాణిజ్య సరుకులుగా పంపిణీ చేయడం వలన ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. చట్టబద్ధమైన, వృత్తిపరమైన బాధ్యత కలిగిన ఫార్మసిస్ట్ యొక్క గౌరవం దెబ్బతింటున్నది. జీఎస్ఆర్ 220(ఈ), జీఎస్ఆర్ 817(ఈ) ల నోటిఫికేషన్ల ముసుగులో ఆన్లైన్లో మందుల అమ్మకాలను చట్ట విరుద్ధంగా విక్రయించే నియంత్రణలేని ఆన్లైన్ ఆపరేటర్స్ ఈ చట్టాల్ని దుర్వినియోగం చేస్తున్నారు. మా ఈ పోరాటం ప్రజారోగ్యం, రోగి భద్రతకు కట్టుబడిన ఉద్యమం. కేవలం వ్యాపారపరమైన ఆందోళనకాదు. ప్రజారోగ్యం, రోగి భద్రత, ఆరోగ్య సంరక్షణ, నైతికతను మేము ఎల్లప్పుడు కాపాడుతూనే ఉంటామన్నారు. ఈ బంద్ సందర్భంగా ప్రజలకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామన్నారు. రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రులలోని ఫార్మసీలు అత్యవసరంగా పనిచేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు.

## ఎలక్ట్రికల్ బస్సులను ఏపీఎస్ ఆర్టీసీ ద్వారానే నడిపించాలి

### ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 18)

రాష్ట్ర ప్రభుత్వం “ ప్రధానమంత్రి ఈ బస్సు సేవా పథకం” కింద రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీలో నూతనంగా ప్రవేశపడుతున్న 750 ఎలక్ట్రికల్ బస్సులను పినాకిల్ కంపెనీ నిర్వహించాలని నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఏపీఎస్ఆర్టీసీ ద్వారానే ఎలక్ట్రికల్ బస్సులను కొనసాగించాలని ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్టీసీ డిపో సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీలో ఒక్కో కొత్త బస్సు కొనాలంటే 1 కోటి 70 లక్షల రూపాయలు ఖర్చు పెట్టాలని, పైగా నిర్వహణ బాధ్యతలు కూడా ఉంటుందని,కొత్త బస్సులను ఆర్టీసీ ప్రభుత్వం కొనుగోలు చేయడం కన్నా ప్రైవేటుకు ఇస్తే ఏ ఇబ్బంది ఉండదని, అందువలన నూతనంగా ప్రవేశపెడుతున్న “ఎలక్ట్రికల్ బస్సులను” ప్రైవేటు ఆపరేటర్లు నిర్వహిస్తారని ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రూ.6,000 కోట్ల విలువచేసే ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు ఇచ్చేందుకు 2026 ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకనే ఉద్దేశపూర్వకంగానే గత ఆరు నెలల కాలంలో కాలం చెల్లిన 264 బస్సులను సర్వీసుల నుంచి తొలగించారన్నారు. వాటి స్థానంలో కొత్త ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయలేదన్నారు. ఏపీఎస్ఆర్టీసీలో 617 మంది డ్రైవర్లు, 821 మంది కండక్టర్లు రిటైర్ అయ్యారు. మొత్తం ఆర్టీసీలో 8,000 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ అయిన పోస్టులు భర్తీ చేయకుండా ప్రైవేటీకరణ చేయడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, కార్మికుల సంక్షేమం దృష్ట్యా పునరాలోచించి ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ బాధ్యతలను పినాకిల్ కంపెనీకి అప్పగించకుండా ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని కోరారు. లేని యెడల కార్మికులు, ప్రజల ఆగ్రహానికి గురవుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు

## జూన్ 1న గుంటూరులోని పొగాకు

# బోర్డు కార్యాలయం వద్దకు పొగాకు రైతుల రాయబారం




### మే 25న పొగాకు వేలం కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు పొగాకు రైతుల సదస్సులో నిర్ణయం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

ఒంగోలులోని ఎన్జీరంగా భవన్లో జరిగిన పొగాకు రైతుల సదస్సులో జూన్ 1వ తేదీన పొగాకు 30 వేలకు తప్పకుండా కొనాలని దీని కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థలను కొనుగోళ్లకు దింపాలని నిర్ణయించడం జరిగింది. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పమిడి వెంకటరావు వడ్డే హనుమారెడ్డి పరిటాల కోటేశ్వరరావు కోడూరు నాంచార్లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో మొదటగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి జుజ్జూరి జయంతి బాబు మాట్లాడుతూ గత సంవత్సరం కిలో 250 రూపాయలతో ప్రారంభమైన వేలం ఈ సంవత్సరం 250 రూపాయలతో ప్రారంభమైందని అన్నారు గత సంవత్సరం ఒక్కొక్క బ్యాడ్ నాకు మూడు నాలుగు లక్షలు నష్టం వచ్చిందని ఈ సంవత్సరం తగ్గుతున్న ధరలను బట్టి చూస్తే ఒక్కొక్క బేరంకు ఐదారులక్షలు నష్టం వస్తుందని అన్నారు. వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకుబేళ్లు 70 శాతం పైగా తిరిగి వెనక్కు తీసుకెళ్లే పరిస్థితి ఏర్పడిందని దర్లేక కొనుగోలు చేయక రైతులు కూలీలకు డబ్బులు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు అందువల్ల ఈ విషయమై చర్చించడానికి కార్యాచరణను ప్రవేశపెట్టారు. జూన్ 1వ తేదీన బొద్దు దగ్గరకు ఉగాది రైతులు రాయబారం వెళ్లాలని దానికి సన్నగా మే 25 తేదీన వేలంకేన్ద్రారు వద్ద నిరసనలు తెలియజేయాలని ప్రవేశపెట్టారు. దీని మీద జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతాంగం అనేక సూచనలు చేస్తూ ఉద్యమాన్ని రైతులందరూ ఐక్యంగా కొనసాగించాలని సూచిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ పొగాకు పై 40 శాతం జిఎస్టి పెంపుదల పొగాకు రైతులకు శాపంగా మారిందని శాపంగా మారిందన్నారు. ఐటిసి కంపెనీకి వేల కోట్ల రూపాయలు లాభాలు వస్తూ ఉంటే ఆ కంపెనీ షేర్లు ఆరున్నర శాతం పెరుగుతూ ఉంటే ఆ కంపెనీకి లాభాలు చేకూర్చే పొగాకు రైతులు మాత్రం బేరం కి ఐదారులక్షలు నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలే కారణమని, దాన్ని ప్రభుత్వం సరిచేసుకోవాలని, దానికోసం రైతులు ఐక్యంగా పోరాటం చేయాలని ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి దాదాపు 90 వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల ఆదుకోవడానికి కేంద్రం 500 కోట్లు కేటాయించి బోర్డు ద్వారా కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని లెటర్లు రాయటం కాదు పొగాకు ఉత్పత్తిదారుల సంఘానికి నిధులు కేటాయించి కొనుగోలు కూడా జరిపించాలని డిమాండ్ చేశారు. అమెరికా ఇండియా వాణిజ్య ఒప్పందం వలన ఏ పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోయిందని పొగాకు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని అన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమలయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సమస్యల ఉద్యమాల ద్వారానే రైతు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ పొగాకు రైతులు నో పట్టించుకునే పరిస్థితుల్లో పొగాకు బోర్డు లేదని అది వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. రాబోయే కాలంలో బోర్డు కూడా లేకుండా చేసే పరిస్థితులు వస్తున్నాయని దీనికోసం రైతులు ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి, నెల్లూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలే వెంకయ్య, మార్కాపురం రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఊస వెంకటేశ్వర్లు, ఆచార్య ఎన్జీరంగా కిసాన్ సంస్థ నాయకులు తుంచి శేషయ్య, వైసీపీ రైతు విభాగం నాయకులు చుండూరి రవి, పొగాకు బోర్డు మాజీ సభ్యులు మారేళ్ల బంగారు బాబు, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కొండగుంట సుబ్బారావు, షేక్ సైదా, జిల్లాలోని అన్ని వేలం కేంద్రాల పరిధిలోని రైతులు పాల్గొన్నారు



## జంగంగుంట్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన ఎస్ఐ గ్రామాల భద్రత పై పోలీసుల ప్రత్యేక దృష్టి







(షణ్ముఖ వెలుగు, కంభం, మే 18)

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం సీఐ శివకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో జంగంగుంట్ల గ్రామంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేశారు. గ్రామంలోని హైవే బ్లాక్ స్పాట్, శివాలయం, రామాలయం, ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంతాల్లో గ్రామ పెద్దల సహకారంతో మొత్తం 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించి రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాల నివారణ, మహిళల రక్షణ, ఆస్తి సంబంధిత నేరాల నివారణపై వివరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జీజీహెచ్‌ను పరిశీలించిన జేసీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి జిజిహెచ్‌ను పరిశీలించారు. జిజిహెచ్ లో వైద్యం అందుతున్న తీరును పలువురు పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేషంట్ల నుంచి వచ్చిన ఫీడ్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లను అడిగి ఓపీలో వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ జిజిహెచ్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పేషంట్ల కు అందుతున్న వైద్యం పట్ల సంతృప్త స్థాయి బాగుందని తెలిపారు. లిఫ్ట్ పని చేస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. లిఫ్ట్ లు పని చేస్తున్న విషయాన్ని తెలిపి వాటి నిర్వహణనను సూపరింటెండెంట్ వివరించారు. ఆసుపత్రి లో వివిధ విభాగాలను ఆమె పరిశీలించారు. ఏబిహెచ్ఏ, కౌంటర్, ఎన్‌టిఆర్ వైద్య సేవ, సదరం, ఎక్స్‌రే, సిటి, ఎంఆర్ఐ, ప్రసూతి, సర్జికల్ వార్డ్, సైకియాట్రీ వార్డ్, బ్లడ్ బ్యాంకులను పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పని తీరు, ప్రొసీజర్ ను అడిగి తెలుసు కున్నారు. కౌంటర్ నిర్వహణ గురించి ఆరా తీసి పలు సూచనలు చేసారు. ఏబిహెచ్ఏ రిజిస్ట్రేషన్ కౌంటర్ పని తీరును అడిగి తెలుసు కున్నారు. పలువురు పేషంట్ల ను వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసు కున్నారు. పలు వార్డుల్లో వైద్యులతో మాట్లాడారు. ఎక్స్‌రే కోసం అవసరమైన పిఏసిఎస్ మెషిన్ ను వెంటనే తెప్పించే ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. పేషంట్లు సేద తీరేలా పూర్తి స్థాయి ఏర్పాటు చెయ్యాలి అని, మంచి నీరు ఎల్లా వేళలా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రి కి వచ్చే వారికీ అన్ని విషయాలు తెలియవు అని వారికీ అవసరమైన సమాచారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వేసవి లో ఫాన్స్, ఏసీ నిర్వహణ విషయం లో జాగర్త ఉండాలన్నారు. డైట్ కాంట్రాక్టర్ విషయం లో కోర్ట్ తీర్పు ఆన్లైన్ లో ఉన్న దానిని సేకరించి నూతన కాంట్రాకర్ కు సరఫరా బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేషంట్ల కు ఇబ్బంది లేదకుండా డైట్ సరఫరా ఉండాలన్నారు. డిఎంఇ, ప్రభుత్వ పరిధిలోని అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎయిడ్స్ పాజిటివ్ రోగి బ్లడ్ కోసం వేచి ఉండగా వెంటనే బ్లడ్ ఏర్పాటు చెయ్యాలని బ్లడ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఫార్మసీలో మందుల అందుబాటు నిర్వహణ గురించి, స్టాక్ రికార్డులు పరిశీలించి, చేసి మందులు కౌంటర్‌ని పరిశీలించారు. జిజి హెచ్ సూపరెంటెండ్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు, డిప్యూటీ ఏఆర్ఎంవో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ మాధవీలత , డాక్టర్ సునీల్ గవాస్కర్, తదితరులు జాయింట్ కలెక్టర్ వెంట వున్నారు.





## శేఖర్ బాబు సేవలు చిరస్మరణీయం

### తెలుగుదేశంపార్టీకి తీరని లోటు
### కుటుంబానికి అండగా ఉంటాం
### ఎమ్మెల్యే ఏలూరి
### నివాళులర్పించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్





(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 18)

తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసిన శేఖర్ బాబు మృతి పార్టీకి తీరని లోటని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శేఖర్ బాబు చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరితో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ, "శేఖర్ బాబును కోల్పోవడం మన అందరి దురదృష్టకరం. ఆరోగ్య సమస్యలతో ఉన్న చాలామంది ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడతారు. కానీ శేఖర్ బాబు గత తొమ్మిదేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటూనే పార్టీ కోసం ఎంతో కృతనిశ్చయంతో పనిచేశారు" అని అన్నారు. "మన కుటుంబ సభ్యుడిని కోల్పోయినంత బాధ కలుగుతోంది. నేను మొదటిసారి పాదయాత్ర చేపట్టిన సమయంలో రాజకీయాల్లోకి వచ్చిన అసలు ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకుని నా వెంట నడిచిన వ్యక్తి శేఖర్ బాబు. నాకు చెదోడు వాదోడిగా నిలిచిన వారిలో ఆయనకు ప్రథమ స్థానం ఉంటుంది" అని భావోద్వేగానికి గురయ్యారు. శేఖర్ బాబు తన పనిని ఎంతో క్రమశిక్షణతో, బాధ్యతతో నిర్వహించేవారని, అందుకే ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసిమెలిసి పనిచేసే స్వభావం కారణంగానే ప్రతి ఒక్కరికి ఆయన ఆత్మీయుడయ్యారని తెలిపారు. శేఖర్ బాబు తన కుమారుడి భవిష్యత్తుపై ఎన్నో కలలు కనేవారని, ఆ కలలన్నింటినీ నెరవేర్చే బాధ్యతను తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ఏలూరి హామీ ఇచ్చారు. కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని శేఖర్ బాబుకు నివాళులర్పించారు.

## పిజిఆర్ఎస్‌కు 227 అర్జీలు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 18)

స్థానిక కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 227 అర్జీలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించిన 147, ఇతర సమస్యలపై 80 అర్జీలు వచ్చినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ రెవిన్యూ సమస్యల పై ఎక్కువగా అర్జీలు వస్తున్నందున వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాధ్యమైనంతవరకు పరిష్కారం ఉన్న వాటిని ఆలస్యం చేయకుండా ప్రజలకు తగిన న్యాయం చేయాలన్నారు. అలాగే మిగతా సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, డిఎల్‌డివో బాలు నాయక్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, ఇతర అన్ని మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## వార్డుల పునర్విభజన ప్రతిపాదిత ముసాయిదా ప్రచురణ

### 24వ తేదీ వరకు సూచనలు, సలహాలు, అభ్యంతరాల స్వీకరణ

### కమీషనర్ పర్వతనేని శ్రీధర్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 18)

కనిగిరి పురపాలకసంఘం పరిధిలో ప్రస్తుతం ఉన్న 20 ఎన్నికల వార్డులను 32 వార్డులుగా పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ పట్టణ ప్రణాళిక సిబ్బంది పురపాలకసంఘం కార్యాలయంలో సోమవారం ప్రచురించారు. ఈ సందర్భంగా కమీషనర్ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 31 ప్రకారం వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణంలో 44,755 వేలు జనాభా ఉందని, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం, స్థానిక అవసరాలు వంటి సమగ్ర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ ప్రతిపాదిత ముసాయిదాను రూపొందించినట్లు వివరించారు. వార్డుల సరిహద్దులతో కూడిన ఈ ప్రతిపాదిత ముసాయిదాను పురపాలకసంఘం కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్, మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కనిగిరి పురపాలకసంఘం కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగానికి వ్రాతపూర్వకంగా సమర్పించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో తుది వార్డుల పునర్విభజన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేనేజర్ పూర్ణిమ, ఆర్ఐ వెంకటేష్, పట్టణ ప్రణాళిక సిబ్బంది కృష్ణ, నవీన్, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరికి ఘన సన్మానం

### పర్చూరు నియోజకవర్గ దేవాలయాల అభివృద్ధికి భారీ నిధులు





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, మే 18)

పర్చూరు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు గ్రామస్తులు, అర్చకులు ఘన సన్మానం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య వేద ఆశీర్వచనం అందజేయగా, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఏలూరి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా 24 దేవాలయాలకు రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో పాటు, సీజీఎఫ్ నిధుల కింద మరో పది దేవాలయాలకు రూ.8.40 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు విడుదల కావడం హర్షణీయమన్నారు. దీంతో పలు ఆలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రహరీ గోడలు, మండపాలు, మరమ్మతులు, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దేవాలయాల పునరుద్ధరణతో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ దేవాలయాలు గ్రామ సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకలని, వాటి అభివృద్ధికి ప్రభుత్వం తరఫున మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం పై 'గుద్దుడే గుద్దుడు'

# అద్దంకిలో వైఎస్సార్‌సీపీ వినూత్న నిరసన





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 18)

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం అద్దంకి పట్టణంలోని 20వ వార్డులో గల పెట్రోల్ బంకు వద్ద 'గుద్దుడే గుద్దుడు' పేరుతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. పాదయాత్ర సమయంలో నారా లోకేష్ రాష్ట్రంలో పెట్రోల్ ధరలు అధికంగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలు తగ్గిస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ ధరలు రూ.112 నుంచి రూ.113 వరకు ఉండటం కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ధరల పెంపుతో గృహిణులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలను తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరిస్తూ.. "ప్రజలు ఎంతో చైతన్యవంతులు. సమయం వచ్చినప్పుడు ఓటు అనే ఆయుధంతో సరైన తీర్పు ఇస్తారు" అని వ్యాఖ్యానించారు. కూటమి నాయకుల మాదిరిగా వెన్నుపోటు రాజకీయాలు తమకు తెలియవని అన్నారు. అనంతరం పెరిగిన ఇంధన ధరలను తగ్గించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



# కందుకూరు ఏరియా ఆసుపత్రిలో ఎన్‌సీడీ క్లినిక్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 18)

"మీ ఆరోగ్యం మీ చేతుల్లో, బాధ్యత మీది, భరోసా మాది" అనే ప్రభుత్వ నినాదంతో జిల్లా ద్వితీయ స్థాయి ఆరోగ్య విభాగం ఆదేశాలనుసారం "ఎన్సిడి క్లినిక్ – 333" సేవలను కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్‌సీడీ క్లినిక్ సెంటర్‌ను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తో కలిసి ప్రారంభించారు. ఎన్ సి డి అంటే నాన్ కమ్యూనికబుల్ డీసీజ్ (సంక్రమణ చెందని వ్యాధులు). ఇవి జన్యు, శారీరక, పర్యావరణ మరియు జీవనశైలి సంబంధిత కారణాల వల్ల కలిగే దీర్ఘకాలిక వ్యాధులు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఈ క్లినిక్ ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాలను డాక్టర్ తులసిరామ్ వెల్లడిస్తూ, 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినప్పుడు షుగర్, బీపీ, క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 60 సంవత్సరాలు పైబడిన వారికి జెరియాట్రిక్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తగ్గించడంలో ఎన్సీడీ కీలకపాత్ర వహిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, భూషయ్య, తిరుపాలు, మీనా కుమారి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ తులసిరామ్, డాక్టర్ రమాప్రియతో పాటు ఇతర వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




# వ్యవసాయ యాంత్రీకరణ పథకం

# చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వం భరోసా

### చిన్నగంజాం మండలానికి రూ.13.3 లక్షలు మంజూరు

### ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

### 19తో ముగియనున్న గడువు

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, మే 18)

చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాంత్రీకరణ పథకం రైతులకు ఆసరగా నిలవనుంది. వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగించే రైతులకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో 2026–27 ఆర్థిక సంవత్సరానికి (ఎస్ఎంఎఎం) పథకం ద్వారా నలభై నుంచి 50 శాతం రాయితీతో వ్యవసాయానికి ఉపయోగపడే యంత్ర పరికరాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో దీనిని ఆ మలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ ఏడాది మండలానికి రూ. 13.3 లక్షలు నిధులు కేటాయించారు. యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అవసరమైన పవర్ టిల్లర్లు, రోటావేటర్లు, హార్వెస్టింగ్ థ్రెషర్లు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఉపయోగించే స్ప్రేయర్లు ప్రభుత్వం ఇవ్వనుంది. వీటితో పాటు విత్తన గొర్రులు, ట్రాక్టరుతో పనిచేసే వ్యవసాయ అనుబంధ పరికరాలతో పాటు 40 హెచ్‌పీ లోపు సామర్థ్యం కలిగిన ట్రాక్టర్లను కూడా రైతులకు సబ్సిడీపై అందజేయనుంది. యూనిట్ వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు కేవలం 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 50 శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందజేస్తుంది. అయిదు ఎకరాలు పైన పొలం కలిగిన రైతులు పరికరాల ధరలో 60 శాతం చెల్లిస్తే మిగిలిన 40 శాతం ప్రభుత్వం భరిస్తుంది. యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు ఈ నెల 19లోపు ఆన్లైన్లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అర్హులైన ప్రతి రైతు ఈ పథకానికి దరఖాస్తు చేసుకొనవచ్చని తెలియజేశారు.

**లబ్ధిదారుల అర్హత ప్రమాణాలు ఇవే**

ఐదెకరాల లోపు సొంత భూమి కలిగిన రైతులు, అటవీ హక్కు పత్రాలు ఉన్న రైతులు వ్యవసాయ యంత్రాలు పొందేందుకు అర్హులు. గతేడాది వ్యవసాయ పరికరాలు రాయితీ పై తీసుకున్న వారు అనర్హు లు. మూడేళ్లుగా ఈక్రాప్ నమోదు చేయించుకొని ఉండటంతో పాటు కుటుంబంలో ఒక వ్యక్తి మాత్రమే ఈ పథకానికి అర్హులు.

**ఎంపిక పారదర్శకం**

మండల వ్యవసాయ అధికారి ఆర్ చంద్రశేఖర్ యాంత్రీకరణ పథకానికి లబ్ధి దారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తామని, ఈ పథకంలో యంత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల జాబితాను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులుకు నివేదిక అందించనున్నాము. తదుపరి ఇన్చార్జ్ మంత్రి ముందు ఉంచుతారని, ఆయన అనుమతితో జాయింట్ కలెక్టర్ లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 23 నుంచి 26 లోపు లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తారని తెలియజేశారు.


Printed by O Radhakrishna Dass On behalf of HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Published from Dr.No. 4-255, PANDARIPURAM CHILAKALURIPET H/O, PURUSHOTHA PATNAM CHILAKALURIPET, GUNTUR, ANDHRA PRADESH - 522616. Mobile : 9494177939, RNI : APTEL/25/A2455, E-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com.

# పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి

**- కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్**





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 18)**

పెట్రో ధరలు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రజలపై పెట్రో భారం రూ.3,391 కోట్లు మోపిందని తక్షణమే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా ఆంధ్ర రాష్ట్రంలోనే అత్యధిక ధర అమలవుతుందని అన్నారు.తాజా పెంపుతో రాష్ట్రంలో లీటరు పెట్రోల్ రూ.113.62, లీటర్ డీజిల్ రూ.101.24కు చేరింది.చంద్రబాబు ప్రభుత్వం మరో 'బాదుడే బాదుడు' మొదలుపెట్టింది. సూపర్‌సిక్స్ తరహాలో మరో మోసంతో పచ్చి దగా చేస్తోంది. అధికారంలోకి వస్తే పెట్రో ధరలు తగ్గిస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, అన్నింటిలాగే ఆ విషయాన్ని కూడా గాలికొదిలేసి చంద్రబాబు 'మరో మోసానికి తెర తీశారని విమర్శించారు. -- ఒకవైపు సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు లేవు. గతంలో జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని పథకాలు రద్దు చేయడమే కాకుండా, ఇప్పుడు ఈ తరహా పెట్రో బాదుడే బాదుడుతో వాహనదారులతో పాటు, ప్రజల నడ్డి కూటమి ప్రభుత్వం విరుస్తోంది.రాష్ట్రంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ఎక్కువగా ఉండటంతో, దేశం మొత్తం మీద ఇక్కడే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ వ్యాట్ను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పెరిగిన ధరల వల్ల అధిక భారం రాష్ట్రంలోని రైతులు చిన్న సన్న కారు వ్యాపారస్తులు మధ్య తరగతి ప్రజలు వాహనదారులపై భారం పడుతుంది. ఎన్నికల ముందు చంద్రబాబు, నారా లోకేష్ తగ్గిస్తామని ఊదరగొట్టి, ప్రజలను నమ్మించేందుకు మ్యానిఫెస్టోలో కూడా పెట్టి ఇక్కడా మాట తప్పారు. ఇప్పుడు పన్ను తగ్గింపుల ఊసేఎత్తడంలేదు.చంద్రబాబుకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, ఇతర బాదుడు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. స్థానిక శాసనసభ్యులు అయితే ప్రజా సమస్యలను పరిష్కరించటం మానేసి అవినీతి అక్రమ దందాల్లో మునిగితేలుతున్నారని ఇసుక మట్టి మాఫియా రేషన్ దందాలతో పాటు ఎంతో పవిత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో కూడా తన బినామీల ద్వారా దందాలు నిర్వహిస్తున్నారని అని తీవ్రంగా విమర్శించారు. గతంలో నేను చెప్పిన విధంగానే మహిమ గల దేవునితో ఇటువంటి ఆటలు ఆడ వద్దని మరొకసారి సభాముఖంగా తెలియజేస్తున్నానని అన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో పెరిగిన ధరలను అదుపు చేసే విధంగా ఆలోచించి ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయాలని అన్నారు. అంతేగాని ప్రజల సమస్యల పైన నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్షాన్ని పోలీసులు ద్వారా గొంతు నొక్కాలని చూడటం శాసనసభ్యులకు తగదని హితవు పలికారు. అనంతరం సబ్ కలెక్టర్ మహిమ వంశీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. తమ నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, అదే విధంగా ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయటానికి కనీసం నీడ కోసం టెంట్ కూడా వేసుకోనికుండా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య,రాష్ట్ర బూత్ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమూల లక్ష్మి నరసింహ, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్‌రెడ్డి, లింగసముద్రం ఎంపీపీ వెన్న కృష్ణయ్య, జిల్లా సెక్రెటరీ చీమల వెంకటరాజా, రాష్ట్ర కల్చరల్ విభాగం అధికార ప్రతినిధి వల్లూరి కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ గేరా మనోహర్, జిల్లా మున్సిపల్ వింగ్ సెక్రెటరీ నగల్ల నారయ్య, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఉచ్చులూరి రవీంద్ర, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు చనమాల కోటేశ్వరరావు, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షులు తొండల ఆదాము, మైనారిటీ అధ్యక్షులు షేక్ రహీం, సీనియర్ నాయకులు ఉప్పుటూరి నాగేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు జిల్లా అధికార ప్రతినిధి బద్దిపూడి జయరావు, ఎస్సీ సెల్ నాయకులు పల్నాటి చెన్నయ్య, గ్రీవెన్స్ అధ్యక్షులు ఎరమాల నాగభూషణం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తుళ్లూరి ఆదిలక్ష్మి, నియోజకవర్గ అంగన్వాడి విభాగం అధ్యక్షులు దేవరకొండ ఆదిలక్ష్మి, తన్నీరు ధరణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన విచారించి బాధితులకు సత్వర న్యాయం చేయాలి

**ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు 88 ఫిర్యాదులు**







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)**

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సోమవారం ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. మీకోసం కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుదిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించి వారితో మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంభందిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, త్వరితగతిన విచారించి చర్యలు తీసుకోని, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని పరిస్థితిలో ఉన్నవారి సమస్యలను ప్రత్యేకంగా పరిశీలనలోకి తీసుకొని, సంఘటన స్థలాలను సందర్శించి చట్టప్రకారం సత్వర న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి శ్రీధర్, ఒంగోలు రూరల్ సిఐ శేషగిరి రావు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్ధన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# జల ధార - జలహారతి పనులు ప్రారంభం






**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 18)**

ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కె రాజుపాలెం పెద్ద చెరువు నందు సోమవారం ఎంపీడీవో బి సురేష్ ఆధ్వర్యంలో జలధార - జల హారతి పనుల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జలధార - జల హారతి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ఎమ్ఐ ట్యాంకులు, కుంటలు, చెరువులు, మొదట వాటి పూడిక తీత పనులు చేయటం జరుగుతుంది. అదేవిధంగా పీడర్ చానల్స్, సప్లై చానల్స్, పంట కాలువలు మొదలగు వాటిని పూడికతీత పనులు చేసి శుభ్రం చేయడం జరుగుతుంది. వర్షాలు పడిన తర్వాత వర్షపు నీరంతా పీడర్ చానల్స్, సప్లై చానల్స్ ద్వారా చెరువులు, కుంటలు మొదలైన వాటికి నీరు చేరి నిండుతాయి తర్వాత పంట పొలాలకు నీటిని పంట కాలువల ద్వారా సరఫరా చేసి పంటలు పండటానికి దోహదపడుతుంది. పంటలు పండి రైతులు ఆదాయం పొందడం ద్వారా జీవన ఉపాధి కలుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎస్‌కే అబ్దుల్లా, టీఏ చిన్నయ్య, ఎఫ్ఎ గంగాధర్, టిడిపి నాయకులు రాచగల్ల శివ, బొడ్డు ప్రసాద్, బ్రహ్మయ్య, ఉపాధి హామీ మేట్లు, శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న శైలిలో ప్రజల్లోకి.... స్కూటీ పై కొండ్రముట్ల పర్యటనకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 18)**

వినుకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పర్యటన సరికొత్తగా, వినూత్నంగా సాగింది. ఒక సాధారణ కార్యకర్తలా ఆయన స్వయంగా ఎలక్ట్రికల్ స్కూటర్ నడుపుకుంటూ ప్రజల్లోకి వెళ్లడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు విశేషంగా ఆకట్టుకుంది.

**కార్లు వదిలి.. ఈ స్కూటర్ ఎక్కి.....**

ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు జీవీ ఆంజనేయులు తన రోజువారీ జీవనశైలిని పూర్తిగా మార్చుకున్నారు. గతానికి భిన్నంగా విలాసవంతమైన కార్లను వదిలేసి, పర్యావరణహితమైన ఎలక్ట్రికల్ స్కూటర్‌ను చేతబట్టారు. వినుకొండ పట్టణంలోని తన నివాసం నుండి ఈపూరు మండలం కొండ్రముట్లపాలెం గ్రామం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ఆయనే స్వయంగా స్కూటీని నడుపుకుంటూ వెళ్లారు.





**రూ.2.50 కోట్ల అభివృద్ధి పనుల పరిశీలన**

కొండ్రముట్లపాలెం చేరుకున్న చీఫ్ విప్ అక్కడ రూ. 2.05 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న తారు రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతను అడిగి తెలుసుకుంటూ, అధికారులకు పలు సూచనలు చేశారు.

**ప్రధాని, ముఖ్యమంత్రి పిలుపుతోనే ఈ నిర్ణయం....**

ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను సగానికి తగ్గించుకుని పొదుపును పాటించాలని ఆదేశించారు. పీఎం, సీఎం స్ఫూర్తితోనే నేను కూడా ఈ నిర్ణయం తీసుకున్నానని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూడా ఇంధన పొదుపుపై దృష్టి సారించాలని, అత్యవసరమైతేనే ప్రయాణాలు పెట్టుకోవాలని జీవీ ఆంజనేయులు సూచించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు.. ప్రజలకు విజ్ఞప్తి...**

ప్రభుత్వ పనులను ఆన్‌లైన్‌లో పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, లబ్ధిదారుల సమస్యలను ఆన్‌లైన్ అర్జీల ద్వారానే పరిష్కరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రజలంతా ఇంధన పొదుపులో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

**హర్షం వ్యక్తం చేసిన ప్రజలు...**

చీఫ్ విప్ హోదాలో ఉన్న జీవీ ఆంజనేయులు సాధారణ వ్యక్తిలా ఎలక్ట్రికల్ స్కూటర్‌పై రోడ్డుపై వెళ్తుండటాన్ని చూసి పాదచారులు, గ్రామస్తులు ఆశ్చర్యానికి లోనయ్యారు. తమ నాయకుడిని అంత దగ్గరగా చూసిన ఆనందంలో ప్రజలు కేరింతలు కొడుతూ, చేతులు ఊపుతూ తమ హర్షాన్ని, మద్దతును వ్యక్తం చేశారు.

## పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఐదు గ్రామాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారితో కలిసి సంబంధిత అధికారులతో సోమవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చిన అర్జీలలో ఆర్థిక సంబంధమైనవి, ఆర్థికేతరమైనవిగా వేరుచేసి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆర్థిక సంబంధమైన సమస్యలు అయితే తగిన ప్రతిపాదనలు రూపొందించి తన ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బడ్జెట్ తో సంబంధంలేని పనులు అయితే తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. సిమెంట్ రోడ్లు వంటి నిర్మాణ సంబంధమైన సమస్య లను ప్రజలు ప్రస్తావిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేటాయింపులు వచ్చినప్పుడు వీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. శాఖా పరంగా స్పష్టమైన నిధులు లేనప్పుడు అనుబంధ శాఖల ద్వారా సమన్వయం చేసుకొని పరిష్కరించదగ్గ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ' అన్నదాత – సుఖీభవ ' వంటి పథకాలలో ఆర్థిక ప్రయోజనం పొందటంలో రైతులకు ఏమైనా భూ సంబంధమైన సమస్యలు ఉంటే వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పల్లెనిద్ర రోజున మండలంలోని అన్ని గ్రామాలకు వివిధ శాఖల జిల్లా అధికారులు పర్యటన నిమిత్తం వెళ్లినప్పుడు కేవలం సొంత శాఖలకు సంబంధించిన సమస్యలే కాకుండా గ్రామంలోని ఇతర సమస్యలను కూడా తెలుసుకుని పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గస్థాయి ' మీకోసం ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఈ కార్యక్రమాలు పూర్తయ్యే నాటికి అన్ని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీధర్ రెడ్డి, పల్లెనిద్ర కార్యక్రమ నోడల్ ఆఫీసర్ చిరంజీవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ జీవీ ఆంజనేయులు







(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 18)

వినుకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినూత్న శైలిలో పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపుతో విలాసవంతమైన కార్లను వదిలేసి, ఆయన స్వయంగా ఎలక్ట్రికల్ స్కూటర్ నడుపుకుంటూ వినుకొండ నుండి ఈపూరు మండలం కొండ్రముట్లపాలెం వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ప్రజల్లోకి వెళ్లారు. ఈ సందర్భంగా కొండ్రముట్ల పాలెం నుండి కనుమల్లపూడి వరకు రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న తారు రోడ్డు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలలో ఎలాంటి రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మార్గమధ్యలో సోడా బండి వద్ద ఆగి స్థానికులతో ముచ్చటించిన ఆయన, దేశ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజకీయాలలో ఆణిముత్యం సిపిఎం నేత డాక్టర్ ముప్వా కొండయ్య





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 18)

నేటి రాజకీయాలలో డాక్టర్ ముప్వా కొండయ్య ఆణిముత్యం లాంటి వ్యక్తి అని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం బడేవారిపాలెం గ్రామంలో జరిగిన సిపిఎం కందుకూరు డివిజన్ సీనియర్ నాయకులు, హోమియో వైద్యులు డాక్టర్ ముప్వా కొండయ్య సంస్మరణ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ ముప్వా కొండయ్య నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు సిపిఎం పార్టీలో కొనసాగారని అన్నారు. రాజకీయాలలో డాక్టర్ ముప్వా కొండయ్య అని చెప్పారు. మరణించటం అందరికీ సహజమని, కానీ విలువలతో కూడిన మంచి వ్యక్తిగా జీవించి చనిపోవడం డాక్టర్ ముప్వా కొండయ్యకే దక్కిందన్నారు. సిపిఎం అభివృద్ధికి దోహదపడటం తోపాటు, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించిన వ్యక్తిగా డాక్టర్ కొండయ్య ఉన్నారని చెప్పారు. రాజకీయాలంటే ప్రజలలో అసహనం కలుగుతున్న ప్రస్తుత రోజుల్లో పదవులే, రాజకీయాలకు గీటురాయిగా ఉండకూడదని కొనసాగిన వ్యక్తిగా కొండయ్య ఉన్నారని పేర్కొన్నారు. అనేకమంది రాజకీయాలలోకి రాగానే పదవులు కావాలని కోరుకునే ఈరోజుల్లో, ముప్వా కొండయ్య జీవితం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందని చెప్పారు. పొగాకు రైతులు ప్రస్తుతం సంక్షోభం లో ఉన్నారని అన్నారు. గతంలో రైతులు ఆందోళనతో గిట్టుబాటు ధరలను సాధించుకునే వారిని అన్నారు. రైతులు గళం విప్పవలసిన అవసరం నేడు ఏర్పడిందన్నారు. పొగాకు సంక్షోభంలో ఉన్న సమయంలో టంగుటూరులో ఆందోళన చేసిన రైతులపై కాల్పులు జరిపారని, ఆ సందర్భంలో పలువురు చనిపోయిన విషయాన్ని శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఆ ఆందోళన ఫలితంగా పొగాకు బోర్డు ఏర్పడిందని, దానిని నిర్వీర్యం చేయటానికి ఈ ప్రభుత్వాలు పూనుకున్నాయని చెప్పారు. పొగాకు సాగు జూదం లాగా తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిసి ఆధిపత్యం పొగాకు పంటపై కొనసాగుతుందని చెప్పారు. రైతులు సమస్యలలో కూరుకపోయిఉన్నా, పాలకులు పట్టించుకోవడంలేదని చెప్పారు. కందుకూరు ప్రాంతానికి ఎప్పటినుండో నాగార్జునసాగర్ కాలువను పొడిగించాలని ఉన్నప్పటికీ, అది అమలు జరగలేదని చెప్పారు. మాలకొండ వద్ద ఐరన్ ఓర్ ఉంది. దానిని జిందాల్ కంపెనీకి ఇస్తే, ఉపయోగం ఉండదని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు కేటాయిస్తే ఆదాయం వస్తుందన్నారు. దానిని ఉపయోగిస్తే కందుకూరు ప్రాంతం తో పాటు, రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ డాక్టర్ ముప్వా కొండయ్య చదువును ప్రోత్సహించారని చెప్పారు. కమ్యూనిస్టులు చదువుని ప్రోత్సహించడంలో ముందు వరసలో ఉన్నారని ఆయన తెలిపారు. నేడు ప్రజలు కమ్యూనిస్టులు రాజకీయాలలో ఉండాలని కోరుకుంటున్నారు. అడిగేవాళ్లు కమ్యూనిస్టులేనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందని, ఆ పోరాటాల ఫలితమే ప్రస్తుతం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకుంటుందని చెప్పారు. ముప్వా.కొండయ్య జీవితం అంతా, తాను నమ్మిన ఆశయం కోసం కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ విధానాల కారణంగా ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, రైతులు పండించిన పంటలకు, గిట్టుబాటు ధరలు ఉండటం లేదని చెప్పారు. ముప్వా కొండయ్యను స్మరించుకోవటం అంటే ఆయనకు నిజమైన నివాళులు అర్పించుకోవటమే నని నరసింగరావు చెప్పారు. మాజీ మంత్రివర్యులు మానుగుంట మహిధర రెడ్డి మాట్లాడుతూ ముప్వా కొండయ్య మితభాషి అన్నారు. పుట్టిన ఊరిని మరిచిపోకుండా ఇండ్లు కట్టుకోవడం జరిగిందన్నారు. ముప్వా కొండయ్య తన పేరును చిరస్థాయిగా, ప్రజలలో నిలిపారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు ముందుండేవారిని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ధన ప్రభావంలో కమ్యూనిస్టులు తట్టుకొని, ఉద్యమాలను ముందుకు తీసుకుపోవలసిన అవసరం నేటి సమాజానికి ఉందని పేర్కొన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా మాజీ కార్యదర్శి జాలా అంజయ్య, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జీవి కొండారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముప్పా రమేష్, చీకటి శ్రీనివాసరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్, కందుకూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఘట్టమనేని చెంచురామయ్య, తెలుగుదేశం నెల్లూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, వైసీపీ రైతు విభాగం కందుకూరు నియోజకవర్గ అధ్యక్షులు నలమోతు చంద్రమౌళి, డాక్టర్ కొమ్మి నరసింహారావు, భాగ్యలక్ష్మి, ప్రముఖ రైతు నాయకులు పొన్నగంటి రామయ్య, సామాజికవేత్తలు బి వెంకటేశ్వర్లు, కాకు వెంకటస్వామి, డాక్టర్ బోడపాటి నరసింహారావు, డాక్టర్ ముప్వా కొండయ్య కుమారులు నరేంద్ర నారాయన్ కుమార్, కంచర్ల శాంతి రోహిణి, రాజేంద్ర కుమార్, రవీంద్ర కుమార్, సిపిఎం గుడ్లూరు, కందుకూరు, ఉలవపాడు, ప్రాంతీయ కమిటీ కార్యదర్శులు జి వెంకటేశ్వర్లు, ఎస్ఎ గౌస్, జివిబి కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు, పి కల్పన, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి, సిపిఎం కొండేపి కార్యదర్శి కేజీ మస్తాన్, ఏపీ రైతు సంఘం వలేటివారిపాలెం మండల కన్వీనర్ మాదాల రమణయ్య, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పై రైతులకు విస్తృత అవగాహన








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. జిల్లాలో పప్పు దినుసుల ఉత్పత్తిని పెంచేందుకు ' ఆత్మ నిర్భర భారత్ మిషన్ ' కింద తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ప్రకాశం భవనంలో జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పథకం ఉద్దేశం, లక్ష్యాలను వివరించారు. దేశంలో పప్పు దినుసుల ఉత్పత్తిని పెంచేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది అక్టోబర్ 11వ తేదీన ఢిల్లీలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. 2026-27 వ్యవసాయ సీజన్ నుంచి 2030-31 సీజన్ వరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పప్పుదినుసుల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాల పంపిణీ, పప్పు దినుసుల కొనుగోలుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. దీని పై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో పప్పు ధాన్యాల సాగును పెంచేందుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటికే సాగు చేస్తున్న ప్రాంతాలలో కూడా దిగుబడి తీరును పరిశీలించి మరింత వచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీల గురించి రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఆత్మ పిడి రత్న మంజుల, జడ్పీ సీఈవో చిరంజీవి, నాబార్డ్ డీ.డీ.ఎం. రవికుమార్, ఎల్‌డిఎం రమేష్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఏపీ లా సెట్ ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యార్థుల ప్రభంజనం

## అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు









(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 18)

ఏపీ లా సెట్ 2026 ఫలితాలలో స్థానిక శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. కందుకూరి ప్రసన్న 399 వ స్టేట్ ర్యాంకును సాధించగా, ఏ సాయి హైందవి 1260 స్టేట్ ర్యాంక్, కె సాయి నందిని 1412 స్టేట్ ర్యాంక్, వై దాక్షాయిని 1667వ స్టేట్ ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్ నారాయణ, తదితరులు విద్యార్థులను అభినందించారు.

# పెరిగిన ఇంధన ధరల పై వైఎస్సార్‌సీపీ నిరసన









(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 18)

పెరిగిపోతున్న ఇంధన ధరలపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని ప్రతిబింబిస్తూ తాటిపర్తి చంద్రశేఖర్ నేతృత్వంలో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ) సోమవారం యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించింది. ర్యాలీ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెట్రోల్ డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో గ్రామీణ వర్గాలు సహా సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన ధరలను తక్షణమే తగ్గించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. పెరిగిన ధరల వల్ల రవాణా ఖర్చులు పెరగడం, ద్రవ్యోల్బణం మరింత వేగవంతం కావడం వంటి సమస్యలను ప్రస్తావించారు. నిరసన ర్యాలీ అనంతరం, ధరల తగ్గింపును కోరుతూ ఆయన స్థానిక తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తదనంతరం స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ధరల పెంపుపై ప్రతీకాత్మకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.